

కెరటం నా ఆదర్శం
లేచి పడుతున్నందుకు కాదు,
పడినా లేస్తున్నందుకు...


Dr.PRK

# పవర్

పోరాడితే పోయెదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప








సంపుటి : 01 సంచిక : 347 | శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


## గూడూరు జయశ్రీకి న్యాయం చేయండి : డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

-ఇంట్లో బంధించిన అత్త మీరాబాయిపై చర్యలు తీసుకోండి
-గతంలో ఆమెకు రాసిచ్చిన ఇల్లు ఆస్తులు ఇప్పించండి
-ఎస్సై సుమన్ కు విన్నవించిన ప్రజా సంఘాల నాయకులు
-డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, చుంచు రాజేందర్, నేదునూరి జ్యోతి, మాదాసి సురేష్



(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 24):
న్యాయం కోసం ఇంటిలో బంధించబడి నిరసన చేస్తున్న బాధితురాలు గూడూరు జయశ్రీకి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, దళిత బహుజన ఫ్రంట్ చుంచు రాజేందర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, ప్రజా సంఘాల జెఏసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ లు కోరారు. ఈ మేరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వారు గురువారం సుబేదారి ఎస్సై సుమన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జయశ్రీ మీద తన అత్త మీరాబాయి తో పాటు భర్త రాధాకృష్ణ గృహహింసకు పాల్పడుతూ అదనపు కట్నం తేవాలని హింసించారని, దీనిపై ఆమె సుబేదారి పోలీస్ స్టేషన్లో కేసు కూడా పెట్టారని తెలిపారు. దీంతో రాజీ మార్గంగా హన్మకొండ రాంనగర్ లోని ఇల్లు తో పాటు హనుమకొండ చౌరస్తాలో గల షాపును నోటరీ డాక్యుమెంట్ ద్వారా రాసి ఇచ్చారని, 10 సంవత్సరాల తర్వాత కోర్టుకు వెళ్లి కోడలతోపాటు మనవడు కార్తీక్, మనవరాలు తేజస్వినిలను బయటకు గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులను తీసుకొచ్చి జయశ్రీ సామాను ఎత్తుకెళుతుండగా ఆమె కూతురుతో కలిసి అడ్డగించిందని, కోపద్రిక్తులైన మీరాబాయి ఆమె కూతుర్లు అల్లుళ్లు కలిసి జయశ్రీ ని ఆమె కూతురును ఇంట్లో బంధించి తాళం వేశారని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో బాధితులు తిండి లేక నిద్ర లేక ఆకలితో అలమటిస్తూ నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. వెంటనే జోక్యం చేసుకొని బాధితురాలికి న్యాయం చేయాలని ఎస్ఐ సుమనుకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేరళ ప్రసాద్ పటేల్, చైతన్య మహిళా సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంపాల కళ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు సంగెం స్వరూపం, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నాయకురాలు పొడిచేటి సరళ తదితరులు పాల్గొన్నారు.

### నిషేధిత జాబితా

# చిక్కుముడి వీడింది

### 22ఏ పరిధిలో ఉన్నా రిజిస్ట్రేషన్లు, తక్షణమే అమలు




నిషేధిత జాబితాలోని సుమారు 300 కాలనీల్లో ఇళ్లు.. ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు వీలు

స్థానిక సంస్థల అనుమతి ఉన్న వాటికే వర్తింపు

ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ ఉంటే చాలు

కీలక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

తక్షణమే రిజిస్ట్రేషన్లు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, పవర్ న్యూస్

దశాబ్దాలుగా పీటముడిలా ఉన్న నిషేధిత జాబితా చిక్కుముడి వీడింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలం నుంచి 22 ఏ జాబితాలో కొనసాగుతున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు శాశ్వత విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, వివేక్‌లు సమావేశమై చర్చించారు. అనంతరం ప్రభుత్వం 22ఏ పరిష్కారాలపై కీలక నిర్ణయం వెల్లడించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, పరిసర జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 కాలనీల్లోని 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లకు

..మిగతా 2లో

### దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో

# ఎదురుదెబ్బ

### అనర్హత పిటీషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

### హైకోర్టు తీర్పునకు సమర్థన



హైదరాబాద్, పవర్ న్యూస్

దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరపున పోటీ చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఘర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతున్నారని వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో

..మిగతా 2లో



### కేసీఆర్.. కుటుంబ సభ్యుల భూములపై..

# విచారణకు ప్రత్యేక కమిటీ

హైదరాబాద్, పవర్ న్యూస్

భూ అక్రమాలు, ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, టి.హరీశ్‌రావులతోపాటు.. వారి కుటుంబ సభ్యులు, మరికొందరు భారాస నేతలకు సంబంధించి ఆయా గ్రామాల్లోనే భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వారి అధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి, ఎసైన్డ్, ఇతర భూముల ఆక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై

# అభిశంసన తీర్మానం

### విపక్ష పార్టీల సంచలన నిర్ణయం

### ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్లాన్.. దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపు




న్యూఢిల్లీ, పవర్ న్యూస్

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఈ క్రమంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు సిద్ధమయ్యాయి. ఎన్నికల సంఘంలోనే విభేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాల్లో వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయనను తొలగించాలని కోరుతున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభల్లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఈ అభిశంసన తీర్మానం నోటీసులకు సంబంధించి ముసాయిదా రూపొందించే పనిలో ఉన్నారని, న్యాయ నిపుణుల పరిశీలన తీసుకొని ఒకటి రెండు వారాల్లోగా లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి కాంగ్రెస్ ఇతర

..మిగతా 2లో



### నేడు అత్యంత

# భారీ వర్షాలు

### భారీ వర్షాలతో అతలాకుతులమైన ఉత్తరాంధ్ర

హైదరాబాద్, పవర్ న్యూస్

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షం దంచికొడుతోంది. ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఈ వర్షాలకు అతలాకుతలమైంది. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఈ క్రమంలో రాష్ట్రంలో వర్షపాత వివరాలను రాష్ట్ర విపత్తుల

..మిగతా 2లో

# దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

**మొదటి పేజీ తరువాయి...**

దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహాచంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును సమర్థించింది.

**సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందన**

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించిన సందర్భంగా ఆయన స్పందించారు. తనకు ప్రజా క్షేత్రంలో బలం ఉందని తెలిపారు. తాను ప్రతి ఇంటికి సేవ చేశానని వాళ్లను అడిగితే తెలుస్తుందన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు.

"సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. గతంలో మూడు సార్లు గెలిచాను. ఒక ఉపఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం. పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు" – దానం నాగేందర్



**ఇదీ కేసు నేపథ్యం**

పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన సభాపతి ఈ పిటిషన్‌లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పును వెలువరించింది.

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

**అలా చేయడం స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని వదులుకున్నట్లే**

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిచ్చారని హైకోర్టు తెలిపింది. శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదని, ఒకవేళ మరో పార్టీ టిక్కెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేదని, అలా నిర్దేశించనపుడు రాజ్యాంగ అనర్హతను నిర్ధారించలేమని స్పీకర్ పేర్కొన్నట్లు హైకోర్టు వివరించింది.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రధానంగా సర్ ప్రక్రియ చుట్టూ తలెత్తిన వివాదాలే ఈ పరిణామానికి కారణంగా నిలిచాయి. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ వంటి అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని ఇటీవల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ ప్రకారం- ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల వ్యవధిలోనే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఇంకా కొన్ని సౌకర్యాలకు సంబంధించిన యాక్సెస్ కోసం గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, దిల్లీలోని ఎన్నికల సంఘం అధికారులను 7 రోజుల్లో 8 సార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాలేదని మరో నివేదికలో తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

**సీఈసీపై తృణమూల్ ఎంపీ ఫిర్యాదు**

మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా గురువారం దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో సీఈఓ జ్ఞానేశ్ కుమార్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏకపక్ష నిర్ణయాలు, విధివిధానాల ఉల్లంఘన, ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆమె ఆరోపణలు చేశారు. సీఈసీ అండ్ ఈసీ యాక్ట్ 2023 సెక్షన్ 16 కింద, ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లు కలిసి తీసుకునే ఉమ్మడి నిర్ణయాలకే చట్టపరమైన రక్షణ (ఇమ్యూనిటీ) వర్తిస్తుందని, ఒంటరిగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న సీఈసీకి ఈ రక్షణ వర్తించదని ఆమె వాదించారు.



కాంగ్రెస్ సీనియర్ నేత ప్రమోద్ తివారీ కూడా ఎన్నికల కమిషన్ తాజా నిర్ణయాలపై తీవ్రంగా విమర్శించారు. సీఈసీపై వస్తున్న ఆరోపణలకు ఎన్నికల కమిషన్ లేదా సీఈసీనే సమాధానం ఇవ్వాల్సి ఉండగా, బీజేపీ నేతలు ఎందుకు స్పందిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఆయనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ చేయాలని కోరారు. ఈ ఎస్ఐఆర్ కారణంగా 19 రాష్ట్రాల్లో ఏకంగా 13 కోట్ల మందిని ఓటరు లిస్ట్ నుంచి తొలగించారని, కర్ణాటకలోనే 1.08 కోట్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. మరో 43 లక్షల మందికి నోటీసులు కూడా ఇచ్చారని మండిపడ్డారు.

సీఈసీని తొలగించడానికి ప్రతిపక్షాలు సిద్ధపడటం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ ఇది జరిగింది. ఈ ఏడాదే మార్చిలో ఒకసారి, మళ్లీ ఏప్రిల్‌లో కూడా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని నోటీసులు సమర్పించాయి. అయితే అప్పుడు సరైనంత సంఖ్యాబలం లేకపోవడం, ఇతర ప్రక్రియల నేపథ్యంలో అవి తిరస్కరణకు గురయ్యాయి. ప్రస్తుతం మరోసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

**అంత సులభమేం కాదు!**

ఇక అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని పదవీకాలం పూర్తికాకముందే తొలగించాలనే ప్రతిపాదనను పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని అభిశంసన తీర్మానం అంటారు. అయితే భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే అనుసరించాల్సిన ప్రక్రియ కూడా చాలా కఠినంగానే ఉంటుంది. పార్లమెంట్ ఉభయసభల్లోకి వచ్చే అభిశంసన నోటీసును ముందుగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్ పరిశీలించి, నోటీసును అంగీకరిస్తే వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. విచారణ జరిపి, ఆరోపణల్లో నిజం ఉందని నివేదిక ఇస్తేనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తారు. అక్కడ మళ్లీ మూడింట రెండొంతుల మెజార్టీతో తీర్మానానికి ఆమోదం లభించాలి. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం కూడా లభించాలి.

# నేడు అత్యంత భారీ వర్షాలు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 8:30 నుంచి గురువారం ఉదయం 7:00 గంటల మధ్య రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా /వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విశాఖపట్నం రూరల్ పరిధిలోని తులసినగర్‌లో 236 మి.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. మధురవాడలో 218 మి.మీ., ఎండాడలో 210 మి.మీ., సీతమ్మధారలో 205 మి.మీ. చొప్పున వర్షం కురియడంతో విశాఖ నగరం జలమయమైంది. తీవ్ర

వాయుగుండం నిన్న రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటింది. దీని ప్రభావం మరో 12 గంటల పాటు కొనసాగి, ఆ తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని పలు చోట్ల శుక్రవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

**జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు**

ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలను, ఇన్-ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పారు. వరద ముంపునకు గురైన బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు.

అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.

**పలు విమానాల దారి మళ్లింపు**

తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో ఉత్తరాంధ్రను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. మరోవైపు భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఏపీలోని ప్రధాన విమానాశ్రయాలలో విమాన రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రన్‌వేలపై భారీగా నీరు చేరడం, దట్టమైన మేఘాలు ఆవరించడంతో విమానాశ్రయ అధికారులు పలు సర్వీసులను దారి మళ్లించడంతో పాటు మరికొన్నింటిని రద్దు చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి దారి మళ్లించగా, హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సిన స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. వాతావరణ పరిణామాలు అనుకూలించని దృష్ట్యా ప్రయాణికులు తమ విమాన సమయాలు, రాకపోకల తాజా సమాచారాన్ని ఆయా ఎయిర్‌లైన్స్ సంస్థల ద్వారా ముందస్తుగా సరిచూసుకోవాలని విమానాశ్రయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

**విశాఖలో ప్రధాన రహదారుల జలమయం**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వేకువజాము నుంచి పడుతున్న వర్షాలకు విశాఖపట్నం నగరం జలదిగ్బంధంలో చిక్కుకోగా, రికార్డు స్థాయిలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసరాల్లో 18 సెం.మీ, కాకినాడ, విజయనగరంలో 13 సెం.మీ, కళింగపట్నం, తునిల్లో 5 సెం.మీ మేర వర్షపాతం రికార్డయింది. విశాఖలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక తీవ్రంగా స్తంభించింది. డ్రైనేజీలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వాయుగుండం తీరం దాటినప్పటికీ భూభాగంపై ప్రభావం కొనసాగుతుండటంతో రాగల కొన్ని గంటల్లో ఉత్తరాంధ్రలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. జీవీఎంసీ, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపడుతుండగా, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు

ఇవాళ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు రెడ్ అలర్ట్ చేసింది వాతావరణ శాఖ. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. గురువారం అల్లూరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 25న అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**తెలంగాణలో వాతావరణం**

తీవ్ర వాయుగుండం ప్రభావం తెలంగాణపై కూడా కనిపిస్తుంది. బుధవారం అతి భారీ వర్షాలు, గురు, శుక్రవారాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ వరంగల్, ఖమ్మం జిల్లాలతో పాటు పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, నల్గొండ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.



## బొల్లారంలో చెత్త వర్గీకరణపై అవగాహన కార్యక్రమం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 24**

స్వచ్ఛతా హి సేవా-2026 కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు బొల్లారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో గురువారం చెత్త వర్గీకరణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వేస్ట్, డొమెస్టిక్ హజార్డస్ (ప్రమాదకర) వేస్ట్‌గా విడివిడిగా వేరు చేసి స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు అందించాలని సూచించారు. చెత్తను సరిగా వర్గీకరించడం వల్ల పారిశుధ్య నిర్వహణ మరింత సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఇళ్లలోనే లభించే తడి చెత్త (కూరగాయల వ్యర్థాలు, మిగిలిన ఆహారం తదితరాలు) సహాయంతో హోమ్ కంపోస్టింగ్ (ఇంటి వద్దే వర్మీ కంపోస్ట్ తయారీ) ఎలా చేసుకోవాలో ప్రజలకు ప్రత్యక్షంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హరీష్, ఆర్పిలు సబిత, సావిత్రి, అజ్మీర్‌తో పాటు కాలనీల మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు అందజేసిన బండి రమేష్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 24**

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమంలో భాగంగా గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీహేమ దుర్గా భవన్ లో చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం ఏబీవీ పురం నివాసి లక్ష్మి, భర్త కిషోర్ కు రూ. 43,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ , కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, మస్తాన్ రెడ్డి, రంగా మోహన్, వాసు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

**హైదరాబాద్, పవర్ న్యూస్**

జరిగే బడాగణేశ్ నిమజ్జన ఘట్టాన్ని వీక్షించేందుకు ట్యాంక్‌బండ్‌కు 700 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. శోభాయాత్ర సాఫీగా సాగేందుకు 20వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తుండగా, 10వేల కెమెరాలు..24 అత్యాధునిక డ్రోన్లతో నిఘా పెట్టనున్నారు. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. గణేశ్ శోభాయాత్రకు గ్రేటర్ సర్వం సిద్ధమైంది. మండపాలలో విశిష్ట పూజలు అందుకున్న గణనాథులను గంగమ్మ ఒడికి తరలించేందుకు భక్తులు సిద్ధమయ్యాయి. ఇప్పటికే చెరువులు, బేబీ పాండ్స్ వద్ద నిమజ్జన కోలాహలం నెలకొంది. ఇందులో భాగంగా నిమజ్జన ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకున్న నేపథ్యంలో బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్, ఖైరతాబాద్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు జరిగే భారీ గణనాథుల శోభాయాత్ర అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోనున్నది.

# వర్ధన్నపేట పాక్స్ ఛైర్మన్‌గా అబ్బిడి రాజిరెడ్డి ప్రమాణస్వీకారం

## రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్న నూతన చైర్మన్



(వర్ధన్నపేట -- పవర్, సెప్టెంబర్ 24): వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని డిసిసిబి బ్యాంకు ఆవరణలో వర్ధన్నపేట మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) నూతన చైర్మన్‌గా అబ్బిడి రాజిరెడ్డి అత్యంత వైభవంగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. వారితో పాటు నూతనంగా ఎన్నికైన పాక్స్ డైరెక్టర్లు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషల వెంకన్న, టౌన్ ప్రెసిడెంట్ ఈగ దామోదర్, పర్వతగిరి సొసైటీ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపెల్లి సొసైటీ చైర్మన్ అత్త కుమార్ స్వామి, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ప్రతి భానుప్రసాద్, మండలంలోని సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, సహకార రంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు మరియు రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

**రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటాం:**

బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు మరియు విత్తనాలు అందేలా చూస్తామని, పాక్స్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తామని స్పష్టం చేశారు. తమ ఎన్నికకు పూర్తి స్థాయిలో సహకరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు గారికి, ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు మరియు సహకార సంఘం సభ్యులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన చైర్మన్‌ను పలువురు నాయకులు, రైతులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కందిక ఎల్లమస్వామి, చిదుముల్ల భాస్కర్, తాటికాయల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ఘన స్వాగతం

(భూపాలపల్లి -- పవర్, సెప్టెంబర్ 24): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ప్రత్యేక స్వాగత కార్యక్రమాన్ని ధర్మవాహిని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.




ఎమ్మెల్యే, ఎస్పీ ముఖ్య అతిథులుగా: ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి:**

వేదికల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే, ఎస్పీలు తిలకించారు. నిమజ్జన శోభాయాత్రలో పాల్గొంటున్న గణేష్ విగ్రహాల నిర్వాహకులకు వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ధర్మవాహిని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు (మెమెంటోలు) అందజేశారు.

**ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు:**

గణాధుని ఆశీస్సులతో భూపాలపల్లి జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే, ఎస్పీ ఆకాంక్షించారు. నిమజ్జన వేడుకలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ముల్క ప్రసాద్ నామినేషన్ దాఖలు

(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 24): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా పోటీ చేస్తున్న ముల్క ప్రసాద్ గురువారం వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జడ్పీ హాల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

**ప్రజాసేవ, సామాజిక కార్యక్రమాల విస్తరణే ధ్యేయం:**

ఈ సందర్భంగా ముల్క ప్రసాద్ మాట్లాడుతూ... ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో రక్తదాన శిబిరాలు, ఉచిత ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో తక్షణ సహాయ కార్యక్రమాలు మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడానికి ప్రత్యేక కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**ప్యానల్ సభ్యులను గెలిపించాలని విజ్ఞప్తి:**

రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు తమ ప్యానల్ సభ్యులతో కలిసి సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి, ప్రజాసేవకు నిరంతరం శ్రమించే తమ ప్యానల్ అభ్యర్థులకు రెడ్ క్రాస్ సభ్యులు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముల్క ప్రసాద్ ప్యానల్ సభ్యులు వడిచర్ల నగేష్, జలిగపు రామ్ ప్రసాద్, వారి మద్దతుదారులు మరియు పలువురు రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

# గుడెప్పాడ్ శ్రీ ఆనంద రామాలయం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి లడ్డూ లక్కీ డ్రా

## స్వామివారి దివ్య ప్రసాదం దక్కించుకున్న కిసరి రాజిరెడ్డి

(గుడెప్పాడ్ -- పవర్, సెప్టెంబర్ 24)



గుడెప్పాడ్ గ్రామంలో శ్రీ వినాయక చవితి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కోలాహలంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ ఆనంద రామాలయం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వినాయక స్వామి లడ్డూ లక్కీ డ్రా పోటీకి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

**విజేతగా నిలిచిన కిసరి రాజిరెడ్డి**

ఈ లక్కీ డ్రాలో స్థానిక కిసరి రాజిరెడ్డి స్వామివారి దివ్య ప్రసాదమైన గణపతి లడ్డూను దక్కించుకున్నారు. లక్కీ డ్రాలో తన పేరు రావడం పట్ల ఆయన తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు తన కుటుంబానికి లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

**స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి**

ఈ సందర్భంగా శ్రీ ఆనంద రామాలయం యూత్ అసోసియేషన్ మరియు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గణపతి లడ్డూను గెలుచుకున్న కిసరి రాజిరెడ్డికి స్వామివారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడు వారి కుటుంబంలో సుఖసంతోషాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటూ ప్రతినిధులు గ్రామస్తులు ఆయనను ఘనంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆనంద రామాలయం యూత్ అసోసియేషన్ సభ్యులు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- ఇర్రెడ్ల వంశీకృష్ణ, డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి, పవర్ దినపత్రిక

# గిరిజన గూడాల్లో కంటైనర్ పాఠశాలలు ప్రారంభించిన మంత్రి సీతక్క



-గిరిజన గూడాల్లో నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం
-మామిడిగూడెం, కొమరం భీమ్‌నగర్‌లో ప్రాథమిక పాఠశాలలు ప్రారంభం
-గిరిజన చిన్నారుల ప్రతిభను ప్రశంసించిన మంత్రి సీతక్క
-మామిడిగూడెంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక హామీ
-సహజత్వాన్ని కాపాడుతూ మల్లూరు ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
-దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష, గోశాల నిర్మాణానికి భూమిపూజ

(ఏటూరునాగారం -- పవర్, సెప్టెంబర్ 24)
మారుమూల గిరిజన గూడాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం ఏటూరునాగారం మండలం మామిడిగూడెంలో సింగరేణి కాలరీస్ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, కొమరం భీమ్‌నగర్ కాలనీలో రూ.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పాఠశాలను కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు.

**కంటైనర్ పాఠశాలలతో విద్యా వికాసం**

అటవీ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ సౌకర్యాలు లేక విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా కంటైనర్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మామిడిగూడెం గుత్తికోయ గూడెంలోని విద్యార్థులు తెలుగు, ఆంగ్ల భాషల్లో చూపిన ప్రతిభను అభినందించిన మంత్రి, వారికి విద్యనందిస్తున్న ఉపాధ్యాయులు ఇర్ప మధు, సారంగం సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేసి చిన్నారులతో కలసి అల్పాహారం చేశారు. గ్రామంలో తాగునీటి కోసం బోరు, సోలార్ విద్యుత్, అంబులెన్సులు వెళ్లేలా రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**సహజత్వంతో మల్లూరు ఆలయాభివృద్ధి**

అనంతరం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి సీతక్క, ఆలయాభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. దట్టమైన అడవులు, ప్రకృతి సంపదకు భంగం కలగకుండా సమగ్ర మాస్టర్‌ప్లాన్‌తో ఆలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, విద్యాశాఖ, దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఎగ్ కార్ట్‌ల పంపిణీ

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 24):
నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (NECC) ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు ఎగ్ కార్ట్ (Egg Carts) పంపిణీ కార్యక్రమం శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల ఫామ్ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పూర్వ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్, వరంగల్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు మరియు అరూరి గట్టుమల్ల మెమోరియల్ ఫౌండేషన్ సెక్రెటరీ అరూరి విశాల్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేశారు. వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన సుమారు 100 మంది లబ్ధిదారులకు ఈ ఎగ్ కార్ట్‌లను అందజేశారు.

**పోషకాహారంలో కోడిగుడ్డు పాత్ర అత్యంత కీలకం:**

ఈ సందర్భంగా అరూరి రమేష్, ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... కోడిగుడ్డులో శరీరానికి అవసరమైన నాణ్యమైన ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు మరియు పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పిల్లల శారీరక ఎదుగుదలకు, కండరాల బలానికి, శరీరానికి తక్షణ శక్తిని అందించడానికి గుడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అతి తక్కువ ధరలో ఎక్కువ పోషక విలువలు అందించే ఆహారంగా కోడిగుడ్డును ప్రతి ఒక్కరూ తమ దైనందిన ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. చిన్నతరహా వ్యాపారులకు, నిరుద్యోగులకు ఈ ఉపాధి బండ్లు ఆర్థికంగా తోడ్పడతాయని ఆకాంక్షించారు.

**హాజరైన ముఖ్య నేతలు:**

ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు, చీజుజజ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎజిల్ కుమార్, ప్రతినిధి రాజీవ్, కోళ్ల ఫామ్ రైతులు సుబ్రహ్మణ్యం, దిలీప్ రావు, పౌల్ట్రీ వ్యాపారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గరుడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా: గణపతి లడ్డూను దక్కించుకున్న కాడబోయిన సునీల్ - రమ్య దంపతులు

(గుడేప్పాడ్ -- పవర్, సెప్టెంబర్ 24):
గుడేప్పాడ్ గ్రామంలో శ్రీ వినాయక చవితి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలోని గరుడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వినాయక స్వామి లడ్డూ లక్కీ డ్రా పోటీకి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

**విజేతగా నిలిచిన కాడబోయిన సునీల్ - రమ్య దంపతులు:**

ఈ లక్కీ డ్రాలో స్థానిక కాడబోయిన సునీల్ - రమ్య దంపతులు స్వామివారి దివ్య ప్రసాదమైన గణపతి లడ్డూను గెలుచుకున్నారు. లక్కీ డ్రాలో తమ పేరు రావడం పట్ల ఆ దంపతులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారి ఆశీస్సులు తమ కుటుంబానికి లభించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

**స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి:**

ఈ సందర్భంగా గరుడ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... గణపతి లడ్డూను గెలుచుకున్న సునీల్ - రమ్య దంపతులకు స్వామివారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడు వారి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ గరుడ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు మరియు గ్రామస్తులు ఆ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా అభినందించారు.



**పాల్గొన్న ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో గుడేప్పాడ్ గ్రామ సర్పంచ్ పరికి రమేష్ బాబు, బలభద్ర చిరంజీవి, కాడబోయిన జగన్, బలభద్ర రితిక్, సామల ప్రశాంత్, సామల రజినీకర్, ఏంబటి చందు, తళ్ళపల్లి రోహిత్, తళ్ళపల్లి రాహుల్, కాడబోయిన రాజు, కాడిదెల సాయి కుమార్, కందగట్ల మహేష్, వంగర విజయ్, పిడుగు సాయి కృష్ణ, తళ్ళపల్లి సన్నీ, బలభద్ర చరణ్, ఏంబటి రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

**ఇర్సడ్ల వంశీకృష్ణ , పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి,**

# రిటైర్డ్ డీఎస్పీ సుదర్శన్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



(హనమకొండ -- పవర్, సెప్టెంబర్ 24)
రిటైర్డ్ డీఎస్పీ శ్రీ సుదర్శన్ గౌడ్ గారిని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు గురువారం పరామర్శించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలందించి, తన సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు, సేవా పతకాలు అందుకున్న బ్యాచ్‌మేట్, మిత్రుడు సుదర్శన్ గౌడ్ గారిని భీమారంలోని వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే నాగరాజు గారు ఆప్యాయంగా కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ గారితో కొంతసేపు ముచ్చటించి, ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో నామినేషన్ దాఖలు చేసిన డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి

**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 24):**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయింది. పోటీలో ఉన్న ప్రముఖ వైద్యులు డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి తమ ప్యానెల్ సభ్యులతో కలిసి హనుమకొండ శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందిన అనంతరం సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌కు చేరుకుని తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.



**19 మంది నామినేషన్ల దాఖలు:**
ఎలక్షన్ ఆబ్జర్వర్, ఇంచార్జి అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. శేషాద్రి పర్యవేక్షణలో మరియు ఎన్నికల అధికారి బి. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నామినేషన్ల ప్రక్రియ సాగింది. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ స్థానాలకై మొత్తం 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.

**రేపు నామినేషన్ల పరిశీలన:**
సెప్టెంబర్ 25 (శుక్రవారం) రోజున ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) కార్యక్రమం జరగనుంది. నామినేషన్లు సమర్పించిన అభ్యర్థులందరూ పరిశీలన సమయానికి రెడ్ క్రాస్ ఎలక్షన్ సెల్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు తెలిపారు.

**నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు:**
డాక్టర్ పి. విజయ చందర్ రెడ్డితో పాటు ఈ.వి. శ్రీనివాస్ రావు, డాక్టర్ నల్ల సురేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ కె. సుధాకర్ రెడ్డి, ప్రొఫెసర్ జ్యోతి, పెద్ది వెంకటనారాయణ గౌడ్, బొమ్మినేని పాపి రెడ్డి, కొక్కిరాల రాకేష్ రావు, బిళ్ళ రమణారెడ్డి, బాశెట్టి హరి ప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బూర రాంచందర్, పుల్లూరు వేణు గోపాల్, మాటేటి నీరజ, డాక్టర్ హెచ్. సంధ్య రాణి, పెండ్లి ఉపేందర్ రెడ్డి, పి.వి. శ్రీనివాస్ రావు మరియు పొన్నాల సంయుక్త తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ చందర్ రెడ్డి ప్యానెల్ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, మద్దతుదారులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# హన్మకొండలో మానవత్వం మరచిన ఘటన పోలీసుల ముందే కోడలు జయశ్రీని ఇంట్లో బంధించిన అత్త మీరాబాయి

## -అత్త వేధింపులు తట్టుకోలేక బాధితుల ఆత్మహత్యాయత్నం
## -మూడు రోజులుగా తిండి నిద్ర లేక అస్వస్థతకు గురైన మనుమరాలు తేజస్విని
## -అధికారులు ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని డిమాండ్






**(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 24)**
హన్మకొండ నగరం రాంనగర్‌లో మానవత్వం తలదించుకునే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వందల కోట్ల ఆస్తిపాస్తులు ఉన్నప్పటికీ అత్త మీరాబాయి తన కోడలు గూడూరు జయశ్రీ, మనుమరాలు తేజస్వినిలను రోడ్డున పడేయడమే కాకుండా పోలీసుల సమక్షంలోనే ఇంట్లో బంధించి తాళం వేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**అదనపు కట్నం కోసం గృహహింస**
బాధితులు మరియు కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... హన్మకొండ 52వ డివిజన్ రాంనగర్‌కు చెందిన గూడూరు మీరాబాయి కుమారుడు రాధాకృష్ణకు, వరంగల్ రంగశాయిపేటకు చెందిన జయశ్రీతో 2003లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ. 20 లక్షల కట్నంతో పాటు ఇతర లాంఛనాలు అందజేశారు. ఆ కట్నం డబ్బులతోనే మీరాబాయి రాంనగర్‌లో ఇల్లు కొనుగోలు చేసింది. వీరికి కార్తికేయ (22), తేజస్విని (16) అనే ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత అత్త మీరాబాయి, భర్త రాధాకృష్ణ అదనపు కట్నం కోసం జయశ్రీపై తీవ్ర గృహహింసకు పాల్పడ్డారు.

**రాజీ కుదిర్చినా మారని వైఖరి**
గతంలో అత్త, భర్త వేధింపులపై జయశ్రీ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టింది. దీంతో సుబేదారి పోలీసులు జోక్యం చేసుకుని రాజీ కుదిర్చారు. ఆ ఒప్పందంలో భాగంగా రాంనగర్‌లోని ఇల్లు మరియు హన్మకొండ చౌరస్తా వద్ద ఉన్న షాపును కోడలు జయశ్రీకి అత్త రాసిచ్చింది. అయితే పదేళ్ల తర్వాత మీరాబాయి మళ్లీ కోడలు, మనుమడు, మనుమరాలిని బలవంతంగా ఇంట్లోంచి గెంటివేసింది.

**పోలీసుల ముందే తాళం వేసిన అత్త**
ఈ నెల 22న మీరాబాయి తన కూతుళ్లు, అల్లుళ్లతో కలిసి గుర్తుతెలియని వ్యక్తులను తీసుకొచ్చి జయశ్రీ సామాన్లను దౌర్జన్యంగా ఎత్తుకెళ్తుండగా జయశ్రీ, కూతురు తేజస్విని అడ్డుకున్నారు. వెంటనే జయశ్రీ డయల్ 112కు ఫోన్ చేయగా పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. అయితే వచ్చిన పోలీసుల ముందే అత్త మీరాబాయి కోడలు, మనుమరాలిని ఇంట్లో బంధించి బయట తాళం వేసి వెళ్లిపోయింది.

**ఆకలితో అలమటిస్తూ నరకయాతన**
గత మూడు రోజులుగా బంధీలుగా ఉన్న తల్లీకూతుళ్లు తిండి, నీళు లేక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మనుమరాలు తేజస్విని కళ్లు తిరిగి పడిపోవడంతో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వందల కోట్ల ఆస్తి ఉన్నా తమను రోడ్డున పడేశారని, అధికారులు స్పందించకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.
?ఈ మానవ హక్కుల ఉల్లంఘనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధితులకు విముక్తి కల్పించాలని, అత్త మీరాబాయిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, పాత్రికేయులు, కాలనీవాసులు కోరుతున్నారు.

---





# గూడెప్పాడ్ కేసీఆర్ కాలనీ 1లో భక్తిశ్రద్ధలతో ఘనంగా వినాయక నిమజ్జనం

**(గూడెప్పాడ్ -- పవర్, సెప్టెంబర్ 24)**
గూడెప్పాడ్ గ్రామ పరిధిలోని కేసీఆర్ నగర్ 1లో నవరాత్రి ఉత్సవాలు ముగించుకున్న శ్రీ వినాయక స్వామివారి నిమజ్జనోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక శోభ మరియు కోలాహలం నడుమ ఘనంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి సమర్పించిన అనంతరం గణనాథుని శోభాయాత్రను అంగరంగ వైభవంగా ప్రారంభించారు.

**ఆధ్యాత్మిక వాతావరణంలో శోభాయాత్ర**
మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బొజ్జ గణపయ్యను ఊరేగించారు. శోభాయాత్ర పొడవునా భక్తులు, మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతికి నీరాజనాలు అర్పించారు. యువకులు, చిన్నారులు భక్తిగీతాలకు నృత్యాలు చేస్తూ, గణపతి బప్పా మోరియా నినాదాలతో కాలనీ పురవీధులను మార్మోగించారు.
మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొనగా, నిర్వహణ సమితి ప్రతినిధులు వేడుకలను అత్యంత నిష్టతో సమర్థవంతంగా నిర్వహించారు. అనంతరం బొజ్జ గణపయ్యకు వీడ్కోలు పలుకుతూ స్వామివారి విగ్రహాన్ని జలంలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.
ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ఉత్సవ నిర్వహణ సమితి సభ్యులు, యువకులు, మహిళలు మరియు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**– ఇర్సడ్ల వంశీకృష్ణ, పవర్ దినపత్రిక,డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి,**



# అక్కినేని కోడలు అదుర్స్..

బ్లాక్ అండ్ రెడ్ డ్రెస్‌లో మెరుపులు



టాలీవుడ్ హీరోయిన్, అక్కినేని కుటుంబం కోడలు శోభితా ధూళిపాళ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. బ్లాక్ అండ్ రెడ్ డ్రెస్‌లో స్టైలిష్‌గా, కాన్ఫిడెంట్ గా ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. తనదైన ఫ్యాషన్ సెన్స్‌తో శోభితా పంచుకున్న ఈ పిక్స్ ఫ్యాన్స్‌తో పాటు ఫ్యాషన్ ప్రియులను అలరిస్తున్నాయి. తాజా ఫొటోషూట్ కోసం శోభితా ధూళిపాళ బ్లాక్ అండ్ రెడ్ కాంబినేషన్‌లో బోల్డ్ అండ్ క్లాసీ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. ఈ కలర్ కాంబినేషన్‌కు అనుగుణంగా ఏర్పాటు చేసిన లైటింగ్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. రోజీ లిప్స్, పర్‌ఫెక్ట్ మేకప్‌తో కెమెరా ముందు ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్ ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్లాక్ అండ్ రెడ్ అవుట్‌ఫిట్‌లో శోభితా లుక్‌కు డ్రమాటిక్ వైబ్ కనిపించింది. స్టైలిష్ లుక్, మేకప్, లైటింగ్‌కు తోడు ఆమె ఇచ్చిన ఫోజులు ఫొటోలకు మరింత గ్లామర్‌ను జోడించాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.



# సైజ్ తగ్గింది.. స్టైల్ పెరిగింది..

## నివేదా సెల్ఫీ నెట్‌లో ట్రెండ్

టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. సహజమైన అందం, నటనతో తెలుగు, తమిళ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. బ్లూ జీన్స్‌లో దిగిన మిర్రర్ సెల్ఫీతో పాటు తన ఫిట్‌నెస్ జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్‌ను అభిమానులతో పంచుకుంది.తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పిక్స్‌లో నివేదా తన 'లెవీస్ 726 హై రైజ్ ఫ్లేర్' జీన్స్ లేబుల్‌ను హైలైట్ చేస్తూ '30 28' అని క్యాప్షన్ ఇచ్చింది. వర్కౌట్స్, క్రమశిక్షణతో రెండు జీన్స్ సైజులు తగ్గినట్లు ఈ పోస్టుతో తెలిపింది. బ్లూ జీన్స్, క్యాజువల్ లుక్‌లో అద్దం ముందు నిలబడి తీసుకున్న మిర్రర్ సెల్ఫీ ప్రస్తుతం నెట్టింట ట్రెండ్ అవుతోంది. మేకప్ లేకపోయినా సహజమైన అందంతో ఆకట్టుకునే నివేదా.. ఈ ఫిట్‌నెస్ లుక్‌లో మరింత స్టైలిష్‌గా కనిపిస్తోంది. ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్‌ను చూసిన అభిమానులు ఫిదా అవుతూ.. 'పర్ఫెక్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్', 'సూపర్ ఫిట్‌నెస్ గోల్స్', 'బ్యూటిఫుల్ లుక్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. దీంతో నివేదా తాజా పిక్స్‌కు సోషల్ మీడియాలో భారీగా లైకులు, కామెంట్లు వస్తున్నాయి.

# లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్‌తో కృతిశెట్టి..

ధర తెలిస్తే కళ్లు తేలేయాల్సిందే!



తెలుగు సినీ పరిశ్రమలో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ కృతిశెట్టి. తన లేటెస్ట్ ఫ్యాషన్ స్టైల్‌తో ఎప్పటికప్పుడు అభిమానులను ఆకట్టుకునే ఈ ముద్దుగుమ్మ.. తాజాగా ఓ వేడుకలో పింక్ ఫ్లోరల్ డ్రెస్‌లో సందడి చేసింది. అయితే ఆమె చేతిలో ఉన్న చిన్న లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్ ఇప్పుడు ఫ్యాషన్ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది.

### షనెల్ లగ్జరీ వాలెట్..

కృతి శెట్టి చేతిలో కనిపించిన వైట్ కలర్ బ్యాగ్ ప్రముఖ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'షనెల్'కు చెందినదిగా నివేదికలు పేర్కొంటున్నాయి. 'షనెల్ వాలెట్ ఆన్ చైన్' తరహాలో కనిపిస్తున్న ఈ చిన్న బ్యాగ్ అంచనా ధర రూ.3.15 లక్షల నుంచి రూ.3.80 లక్షల వరకు ఉంటుందని సమాచారం. క్లాసీగా కనిపించే ఈ లగ్జరీ యాక్సెసరీ కృతి ఓవరాల్ లుక్‌కు మరింత హైఫ్యాషన్ టచ్ తీసుకొచ్చింది.

### వరుస సినిమాలతో బిజీ..

కృతి శెట్టి ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'వా వాతియార్', 'మనమే', పాన్ ఇండియా చిత్రం 'ఎ.ఆర్.ఎమ్'తో ప్రేక్షకులను అలరించిన ఈ బ్యూటీ.. ఇటీవల 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'లోనూ సందడి చేసింది. ప్రస్తుతం 'జీనీ' వంటి సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతోంది.



# ఎరుపు చీరలో ముద్దుగుమ్మ

వైరల్‌గా మారిన ఫొటోలు

టాలీవుడ్‌లో తనదైన నటన, అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రియా శరణ్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. ఎరుపు రంగు చీరలో సంప్రదాయ, స్టైలిష్ లుక్‌లో కనిపించిన ఆమె ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఎరుపు చీరకు అనుగుణంగా శ్రియా శరణ్ సింపుల్‌గా, ఎలిగెంట్‌గా ముస్తాబైంది. చీరలో ఆమె ఇచ్చిన వివిధ పోజులు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లోనూ తనదైన స్టైల్‌ను చూపిస్తూ కెమెరా ముందు ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే శ్రియా శరణ్ తరచూ తన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటుంటుంది. ఈ క్రమంలో తాజాగా ఎరుపు చీరలో షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఫ్యాన్స్, ఫ్యాషన్ ప్రియులు ఈ ఫొటోలను తెగ షేర్ చేస్తూ శ్రియా లుక్‌ను ప్రశంసిస్తున్నారు.



# పింక్ కార్సెట్ గౌనులో ఖుషీ

ఫెయిరీ ప్రిన్సెస్ లుక్‌తో రచ్చ!

దివంగత లెజెండరీ నటి శ్రీదేవి, ప్రముఖ నిర్మాత బోనీ కపూర్‌ల చిన్న కుమార్తె, యంగ్ బాలీవుడ్ బ్యూటీ ఖుషీ కపూర్ తాజాగా షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోడ్రన్ పింక్ గౌనులో ఫెయిరీ ప్రిన్సెస్‌లా మెరిసిపోతూ ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. అక్క జాన్వీ కపూర్ బాటలోనే గ్లామరస్ లుక్స్‌తో అలరిస్తున్న ఖుషీ తాజా ఫొటోషూట్ ప్రస్తుతం నెట్టింట ట్రెండ్ అవుతోంది. తాజా ఫొటోషూట్ కోసం ఖుషీ కపూర్ ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా కౌచర్ లైన్‌కు చెందిన 'సాఫ్ట్ పింక్ టెక్స్చర్డ్ కార్సెట్ గౌన్'ను ఎంచుకుంది. స్ట్రక్చర్డ్ కార్సెట్ బోడిస్, ఫ్లోయింగ్ డ్రేప్స్‌తో ఉన్న ఈ డ్రెస్ ఆమెకు కంటెంపరరీ ఫెయిరీ ప్రిన్సెస్ లుక్‌ను తీసుకొచ్చింది. పింక్ షేడ్‌లో ఎంతో క్లాసీగా కనిపించిన ఖుషీ.. తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ లగ్జరీ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "నాకిష్టమైన గౌనులో ఫెయిరీ ప్రిన్సెస్ డ్రీమ్స్‌ను ఆస్వాదిస్తున్నా" అంటూ ఖుషీ క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారగా.. అభిమానులు "సో ప్రెట్టీ ఖుషీ", "గార్జియస్ లుక్", "అచ్చం దేవకన్యలా ఉన్నావ్" అంటూ కామెంట్లతో సందడి చేస్తున్నారు. లైకులతో పోస్టును ట్రెండ్ చేస్తున్నారు.